ఆంధ్రసంఘము, కలకత్తా, - 1980-81

"విష్ణువు లక్ష్మిని వక్షస్థలం మీద నిలుపుకున్నా, శివుడు పార్వతికి అర్థశరీరమిచ్చినా ఆ దేవుళ్ళు తమకు ఉన్నవీ, వీలుపడినవీ మాత్రమే భార్యలకిచ్చారు. లేనివీ వీలుపడనివీ ఇవ్వడం మనిషి వల్లనవుతుందా?"

# తరణోపాయం

ప్రస్తుతం ఆంధ్రదేశంలో విరివిగా వస్తున్న పత్రికల ధర్మమా అని చాలామందికి రచనలు చేసే అవకాశం లభిస్తోంది. ఒకప్పుడు రచయిత రచనలెందుకు చేసేవాడో తెలియదు కానీ ఇప్పుడుమాత్రం నాకు తెలిసినంతవరకు అతని ధ్యేయం ఒకటే - అదే రచయిత ననిపించుకోవడం.

ఇది చదివి రచయితలందరూ నామీద కారాలూ మిరియాలూ నూరబోయేముందు నేను నాకు తెలిసినంతవరకూ అని పై పేరాలో రాసిన విషయాన్ని మరోసారి గమనించ గోర్తాను. నాకు తెలిసిన విషయాన్ని నాకు తెలియని రచయితల కంటగట్టే దుస్సాహసానికి ప్రస్తుతానికి నేను పూనుకోబోవడం లేదు.

ఇంతకూ నేనిది రాయడానికి కారణం నా శ్రీమతి. ఆమెకు రచయిత్రి అవాలని మహా'ఇది'గా ఉంది. ఆ 'ఇది'ని ఎన్నోసార్లు నాముందు ప్రకటించింది. అప్పుడు నేనామెను కొన్ని ప్రశ్నలడిగాను.

ఆమెలో విపరీతమైన ఆవేశముంది. నేను ఆఫీసునుంచి ఇంటికి ఆలస్యంగా వచ్చినప్పుడూ, చీరకొంటానని మాట తప్పినప్పుడూ, పనిమనిషి రాకపోతే అంట్లు తోమడంలో సాయం చేయనప్పుడూ ఇంకా ఇటువంటి అనేక సందర్భాల్లోనూ ఆమెకు ఆవేశం రావడం నేనెరుగుదును. ఆవేశం వచ్చినప్పుడు ఆమె తనను తాను మరిచిపోయేది. తనేం మాట్లాడుతోందో తనకే తెలిసేది కాదు.....

రచయిత్రి కావాలనుందని శ్రీమతి నాతో అన్నప్పుడు నాకీ విషయం స్ఫురణకొచ్చింది. అప్పుడు నేను నా మొదటి ప్రశ్నను వేశాను. "వసూ! నేనాఫీసునుంచి ఆలస్యంగా వచ్చినప్పుడు నీకు కలిగే ఆవేశం లాంటిది కోయిల పాట విన్నప్పుడు కలుగుతుందా?" అని.

ఈ ప్రశ్నకు జవాబు రాబట్టేముందు శ్రీమతిని కొంతసేపు బ్రతిమాలవలసి

వచ్చింది. ఎందుకంటే నేను తనను వేళాకోళం చేశానన్న దురభిప్రాయమామెకు కలిగింది. ఆమె పాయింట్‌లోనూ కొంత న్యాయం లేకపోలేదు. ఆఫీసునుంచి ఆలస్యంగా వచ్చినప్పుడు "లాంటి" ఆవేశమని ఎందుకనాలి అంటుందామె. అది తప్పేనని ఒప్పుకున్నాక కోయిల పాట తనకెటువంటి ఆవేశాన్నీ కలిగించదనీ, అది ఆవేశం కలిగించవలసిన అవసరం కూడా తనకు కనబడలేదనీ ఆమె చెప్పింది.

"అలా అంటే ఎలా వసూ, కవిత్వానికి ఆవేశం కావాలి. నీది వనితావేశమే కానీ కవితావేశం కాదన్నమాట" అన్నాను.

"మీ వేళాకోళానికేంగానీ ఆ కోయిలపాటకే ఆవేశపడాలా' మరింకేవైనా ఉన్నాయా చెప్పండి!" అంది శ్రీమతి.

"లేకేం - సెలయేటి గలగలలు, వసంతకాలపు చల్లని పిల్లతెమ్మెరలు, శ్రీకృష్ణుడి మోహనరూపం...." అని నేనింకా లిస్టు చదవబోతుండగా శ్రీమతి వారించింది..... "చాలు స్వామీ చాలు! ఇలాంటి వాటిమీద నాకింట్రెస్టు లేదు. కానీ రిక్షావాడితో బేరమాడేటప్పుడూ, మన పనిమనిషితో వ్యవహరించేటప్పుడూ నాకు చాలాసార్లు బోలెడు ఆవేశం కలిగింది. ఇది ఎందుకైనా ఉపయోగిస్తుందేమో చెప్పండి"

ఆమె ఈ ప్రశ్న నా రెండవ ప్రశ్నకు కారణమైంది.

"వసూ! పెరిగే ధరల మధ్య మనమిచ్చే ఆ కాసిని డబ్బులతో వాళ్ళు తమ జీవితాన్నెలా గడుపుతున్నారా అన్న బాధే నీలో ఆవేశాన్ని కలిగిస్తూ ఉంటుందా?"

ఈ ప్రశ్నకు జవాబివ్వడానికి మా ఆవిడకు ఐదు నిముషాలు పట్టింది. అందుక్కారణం అంతసేపూ ఆమె ఆలోచిస్తూ ఉండి ఉండడం కాదు. నేను ప్రశ్న అడిగిన వెంటనే వచ్చిన నవ్వు నాపుకోడానికి ఆమెకు అంత సేపు పట్టింది.

"ఏడిసినట్లుంది మీ ప్రశ్న! వాళ్ళిచ్చే డబ్బులు సరిపోతున్నాయా అని గవర్నమెంటు వాళ్ళు మన విషయంలో ఆలోచిస్తున్నారా ఏమిటి? ఇచ్చేవాడెప్పుడూ పుచ్చుకునేవాడి గురించి ఆలోచించకూడదు. అలా ఆలోచిస్తే బ్రతకలేం."

"ఎందువల్ల?"

"ఎందుకేంటండీ ముష్టాడు అమ్మా పిడికెడు బియ్యం వెయ్యండంటాడు నాలుగు గింజలు వేస్తాం. వెంటనే మరచిపోతాం. మరచిపోకుండా, వాడెలా బ్రతుకుతాడూ - ఆ నాలుగు గింజలతో వాడి కడుపు నిండుతుందా అని ఆలోచిస్తూ కూర్చుంటే..."

"అర్థమయింది వసూ మరి నువ్వు రచయిత్రివి కాలేవు" అన్నాను.

"ఎందుకు కాలేను - రచయిత్రులందరూ వాళ్ళే రాస్తున్నారా ఏమిటి - నా పేరున మీరు రాసిపెట్టండి, ఎంచక్కా రచయిత్రినై కూర్చుంటాను"

అప్పటికి శ్రీమతి అభిప్రాయం నాకు అవగతమైంది. నేను కష్టపడి కథరాసి ఆమె పేరుపెట్టాలి. అదేమంత కష్టమైన విషయం కాదు. కానీ అసలు చిక్కు ఎక్కడున్నదంటే నాకు కథలు రాయడం రాదే - కర్మ!

విష్ణువు లక్ష్మిని వక్షస్థలం మీదనిలుపుకున్నాడు. శివుడు పార్వతికి అర్థశరీరాన్ని

చ్చాడు. ఇలా ఆ దేవుళ్ళిద్దరూ కూడా తమకు ఉన్నదీ, వీలుపడినదీ మాత్రమే భార్యలకిచ్చారు. కానీ వీలుపడని రచనలను ఇమ్మంటే నేనెలా ఇచ్చి చచ్చేది?

అయితే శ్రీమతి చాలా పట్టుదల మనిషి. తను అనుకున్న పని ఏదోవిధంగా సాధించిగానీ ఆమె నిద్రపోదు. ఫలితంగా నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

నాకు కథ రాయడం చేతకాదు సరికదా - కథ రాయాలన్న కుతూమలం కూడా లేదు. ఎప్పుడు ఎవరికథ చదివినా బాగుందని అనందించడమే కానీ విమర్శించే తెలివి కూడా లేదు. అయినాసరే కథ రాయడం నాకు తప్పలేదు.

చిట్టచివరకు శ్రీమతి పట్టుదల మీద ఒక కథ రాశాను. కథలో కాలేజీలో చదువుకునే ఒక అబ్బాయి తన క్లాస్‌మేట్ అయిన అమ్మాయిని ప్రేమిస్తాడు. ఈ ఐడియా శ్రీమతే నాకిచ్చింది. అయితే ఇక్కడే నాకో పెద్ద సందేహమొచ్చింది. శ్రీమతితో అన్నాను:

"నీతో పెళ్ళికి ముందు నాకో సంబంధమొచ్చింది. అమ్మాయి అందంగానే ఉన్నప్పటికీ సంబంధం మావాళ్ళకి నచ్చినప్పటికీ వయసు కారణంగా అది ఎగిరిపోయింది. ఆ అమ్మాయి నాకంటే ఒక సంవత్సరం మాత్రమే చిన్న. అయిదేళ్ళైనా తేడా ఉండాలనీ కనీసం మూడేళ్ళైనా లేకపోతే బాగుండదనీ మా అమ్మ అనడంతో నీకు నాభార్య అయే యోగం పట్టింది. మరి మనకథలో హీరో చాలా బుద్ధిమంతుడు. క్లాసులో అన్నింట్లో ఫస్టుగా వస్తాడు. అలాంటి వాడు సరైన క్లాసుకి సరైన వయసులోనే వచ్చి ఉండాలి గదా. అమ్మాయి కూడా అటువంటిదే. అందువల్ల వాళ్ళిద్దరికీ జంట ఎలా కుదురుతుంది"

"అది పెద్దలు చూసిన సంబంధం లెద్దురూ - ప్రేమించుకునే వాళ్ళు వయసు చూసుకుంటారేమిటి?" అంది శ్రీమతి.

"స్వానుభవం మీద చెబుతున్నావా?"

"ఆఁ స్వానుభవం మీదే చెబుతున్నాను. వయసైతే ఉందేమో కానీ చంటిపిల్లాడికన్న అన్యాయం మీరు" అంది శ్రీమతి.

"అయితే ఓ పని చేద్దాం. మన హీరోయినూ, హీరో ప్రేమించుకున్నారు కదా. వీళ్ళ పెళ్ళికో కొత్త ప్రతిబంధకం చూపిద్దాం. కులాలూ, మతాలూ ప్రసక్తి ఎందుకు - అమ్మాయీ, అబ్బాయి సమవయస్కులవడం కారణంగా పెద్దలా పెళ్లికి అంగీకరించడం లేదంటే కొత్త రకంగా ఉంటుందేమో."

అలా వీల్లేదంది శ్రీమతి. అటువంటి కారణం హాస్యాస్పదంగా ఉంటుందంది. చేయితిరిగిన రచయితలు తప్ప కొత్తవాళ్ళు ప్రయోగాలు చేయరాదంది. అందరి కథలలాగే మనకథా ఉండాలంది. ఫలితంగా మా కథ ఇలా నడిచిపోయింది. అమ్మాయీ, అబ్బాయీ ప్రేమించుకున్నారు. చదువు సంగతి పట్టించుకోకుండా ప్రేమ విహారాలు చేశారు. పరీక్షలముందు మాత్రం కష్టపడి చదివేసి ఇద్దరూ కూడా యూనివర్సిటీకి ఫస్టుగా వచ్చేశారు. ఎలా వచ్చారని అడగద్దు. హీరో హీరోయిన్లకంటే ఇతరులు గొప్పవారుండటం ఇష్టం లేక శ్రీమతి ఫస్టువాళ్ళకే ఇప్పించాలంది. ఇద్దరిలో ఎవరినీ చిన్న బుచ్చడం ఇష్టంలేక ఆ ఫస్టు ఇద్దరికీ రావాలంది. బహుశా ఇద్దరికీ సరిసమానంగా

మార్కులు వచ్చుంటాయి. అది అసాధ్యమేం కాదు. ఇద్దరూ ప్రేమించుకున్నారుగదా ఒకరి మనసు నొకరు అర్థం చేసుకొని ఏకీభావం కోసం తాపత్రయ పడ్డట్టే పరీక్షల్లో ఒకరి పేపరు నొకరు అర్థం చేసుకుని ఏకీభావాన్ని పొందగలిగి ఉంటారు. ఆ తర్వాత హీరోకి ఓ పెద్ద కంపెనీ వాళ్ళు స్వయంగా ఇంటికి వచ్చి ఓ పెద్ద ఉద్యోగాన్ని ఆఫర్ చేశారు. హీరో యూనివర్సిటీకి ఫస్టుగా రావడం వాళ్ళు పేపర్లో చూశారట. హీరో ఉద్యోగంలో చేరాడు. అతను పనిచేస్తున్న కంపెనీ యజమానికో అందాల కూతురు. ఆమెకు హీరో నచ్చాడు. హీరో ఆమెతోనూ చాలాకాలం విహారాలు చేశాడు. (ఈ మధ్యకాలంలో హీరోయిన్ ఏమయిందో నాకూ తెలియదు). ఒకరోజు కంపెనీ యజమాని హీరోకు తన కూతుర్నిచ్చి పెళ్ళి చేస్తానన్నాడు (ఇక్కడ కులమత ప్రసక్తి లేదు, హీరోలకి వాళ్ళ యజమానులు తమ కూతుళ్ళనిచ్చి వివాహం చేసి తీరవలసిందే). హీరో ఒప్పుకోలేదు. యజమాని తనకు తండ్రితో సమానమంటూ ఆయన కూతురు తనకు చెల్లెలవుతుందిట. (ఇటువంటి న్యాయ సూత్రాలు క్లాసుమేట్సుకు వర్తించవు). ఆమె నింతకాలమూ తనాదృష్టితోనే చూస్తున్నాడనీ అంత తొందరగా తన దృష్టి మారదనీ హీరో అనేశాక కంపెనీ యజమానికి కోపం వచ్చి హీరో ఉద్యోగం పీకేశాడు. ఇప్పుడు హీరోయిన్ మళ్ళీ కథలోకి వస్తుంది. ఆమె కాలేజిలో చదివి ఉండవచ్చుగాక, హీరోతో ఎక్కడెక్కడికో విహారాలు చేసి ఉండవచ్చుగాక - ఇప్పుడామె నిరుపేదరాలు. తన డిగ్రీ సహాయంతో తలిదండ్రులనీ, అన్నదమ్ములనీ, అక్కచెల్లెళ్ళనీ పోషించడం కోసమనీ ఆమె ఎన్నో ఉద్యోగాలకోసం ప్రయత్నించింది. అన్నిచోట్లా ఆమెకు ఉద్యోగావకాశం వచ్చింది. కానీ యజమానుల పలకరింపులో గోచరించిన వెకిలితనం కారణంగా ఉద్యోగాన్నంగీక రించలేకపోయింది. కానీ ఒక రోజున హఠాత్తుగా ఆమె తండ్రికి ప్రాణం మీదికి వచ్చింది. అదేరోజున చాలాదూరంలో ఉన్న పట్నంలో అన్నగారికి ఇంటర్వ్యూ వచ్చింది. తమ్ముడికి పరీక్ష ఫీజు కట్టాలి. ఆ రోజున చాలా ఆలోచించి ఎంతో అభిమానవతి అయినప్పటికీ హీరోయిన్ హీరోదగ్గరకు వెళ్ళింది. అప్పుడే నాకూ తెలిసింది తమసంసారం ఓ కొలిక్కి వచ్చేదాకా హీరోయిన్ హీరోని ఆగమందట. హీరో ఆగేడట. అంతవరకూ ఆమె ఎన్నడూ హీరోని ఏమీ అడగలేదు. మొదటిసారిగా అతని వద్దకు ధనసహాయార్థం వచ్చింది. అదే రోజున హీరో ఉద్యోగం ఊడింది.

శ్రీమతి చెబుతున్న ప్లాటు ఇంతవరకూ వచ్చేక హఠాత్తుగా నాకో సందేహం వచ్చి - " వసూ మనం కథ రాస్తున్నామా, నవల రాస్తున్నామా" అని అడిగాను. కథ అనే మొదలుపెట్టాను గానీ తీరా ఇప్పుడు చూస్తే నవల అయేలా ఉందని శ్రీమతి అంది. ఏదేమయినా రోట్లో తలపెట్టి రోకటిపోటుకు ఏడవనేల? కథ చెప్పమన్నాను శ్రీమతిని.

కథంతా చెప్పి మిమ్మల్ని విసిగించదల్చుకోలేదు. చివరికి హీరో హీరోయిన్ని పెళ్ళిచేసుకున్నాడు. వాళ్ళిద్దరికీ కష్టాలు కలిగించిన వారందరూ పెళ్ళికి వచ్చి క్షమార్పణలు చెప్పుకున్నారు.

కథంతా పూర్తయేక శ్రీమతిని అభినందించాను. ఈ కథ ప్రచురితం కావాలిగానీ

సినిమా తీసే ప్రమాదముందని కూడా అన్నాను. గర్వంతో ముసిముసి నవ్వులు నవ్వింది శ్రీమతి.

శ్రీమతి చెప్పినప్పుడు చాలా పెద్దదిగా కనిపించింది కానీ తీరా నేను రాస్తే నలభై ఆరు పేజీలు వచ్చింది కథ. కథ పోస్టు చేసిన రోజున శ్రీమతి ఏడుకొండలవాడికి మొక్కుకుందని నా అనుమానం.

తిరుగు స్టాపులు పెట్టాంకానీ ఏడాదయినా కథ తిరిగి రాలేదు. రాకపోవడం వల్లనే అది ప్రచురితం కాగలదన్న నమ్మకం శ్రీమతి కుండేది. కానీ నెలలు గడిచిన కొద్దీ ఆ నమ్మకం సన్నగిల్లింది. ఏడాదిగడిచేక మరి ఆ కథ ప్రచురించబడదని ఇంచుమించు నిశ్చయమైపోయింది.

ఈ లోగా మరికొన్ని సాహిత్య ప్రక్రియలు కూడా ప్రయత్నించాం మేమిద్దరమూ! ఆరంభంలోనే అంత పెద్ద కథ రాసి ఉండరాదని శ్రీమతి బాధపడింది. తనంత పెద్ద కథ చెబుతున్నప్పుడు మందలించనందుకు నా మీద కోప్పడింది. అలా అంది గదా అని "అసలు మనం కథ రాయడమెందుకూ" అంటూ మందలించేసరికి తను చెప్పని విషయాలకు మందలించవద్దని కసిరింది. ఏమయితేనేం ఏడెనిమిది పేజీలలో ఓ కథ రాశాం మళ్ళీ. సంస్కారం బొత్తిగా లేని పొరుగువాళ్ళమీద కథ అది. ప్లాటు శ్రీమతిది. శైలినాది. కథ ప్రచురితం కాకపోతే తప్పు పత్రికల వారిది.

దాంతరువాత ఒక గేయాం రాశాం.

చందమామకు వెన్నెలెందుకు - కలువకన్నెకు విందులెందుకు - భాస్కరునికి తేజమెందుకు - పద్మ సుందరి పరువమెందుకు? అంటూ ఏమేమో రాస్తే ఈ రచనకు ప్రచురణెందుకు అనుకున్నారో ఏమో పత్రికల వాళ్ళు దాన్ని ప్రచురించలేదు.

ఆ తరువాత "కనిపించనిదూరతీరాలకు" అన్న టైటిల్‌తో ఓ ఆధునిక కవిత రాశాం. పంపించడం పత్రికకే అయినా అది కనిపించని దూరతీరాలకు వెళ్ళిపోయింది.

ఎన్నో ప్రయత్నాలు చేశాం. అవన్నీ వమ్మైపోయాయి.

శ్రీమతికి ఉడుకుమోత్తనం వచ్చి నాకు రాయడంచేతకాకపోవడం వల్లనే వాటి ప్రచురణ జరగలేదని చెప్పసాగింది. నేనూ ఊరుకోలేదు. అసలు నువ్వు సజస్టు చేసిన కథా వస్తువు బాగాలేదన్నాను.

"ఆ సంగతి అప్పుడే చెప్పలేకపోయారా?" అంది శ్రీమతి.

"నా రాత బాగోలేదని నువ్వు అప్పుడు చెప్పావు కనుకనా?" అన్నాన్నేను.

ఇలా ఎంతగా వాదులాడుకున్నా - తిరుగుస్టాంపులు పెట్టినా తిరిగిరాని మా మొదటికథ మీద శ్రీమతికి చాలా ఆశ ఉంది. ఆశ క్రమంగా అనుమానంగా మారసాగింది. ఆ అనుమానం చాలా చిత్రమైంది. ఆ పత్రిక వాళ్ళు తన కథని సినిమాకి అమ్మి సొమ్ము చేసుకున్నారేమోనని ఆమెకు అనుమానం కలిగింది. ఆ అనుమానం వచ్చేక ఆమెకు చూసిన ప్రతి తెలుగుసినిమాలోనూ తనకథ పోకడలు కనిపించసాగాయి. తనకథను ఎంత మంది నిర్మాతల కమ్మారేమిటి చెప్మా అని ఆలోచించసాగింది శ్రీమతి.

అప్పటికీ నేను చెప్పాను. తెలుగు సినిమాలనేకం చూశాక ఆ ప్రభావం వల్లనే నీవా కథ నాకు చెప్పావు. నీవు చెప్పింది మన సినిమాలకు మూల కథ. కొద్ది మార్పులతో మన సినిమాలన్నీ ఇదే కథను స్వీకరిస్తాయి. ఇది అనాదిగా జరుగుతోంది. ప్రళయకాలం వరకూ జరుగుతుంది. అందువల్ల అనవసరంగా పత్రికల వాళ్ళ ననుమానించకు అంటూ నచ్చ చెప్పేకామె శాంతించి "సరే తిరుగు స్టాంపులు పెట్టినా తిప్పిపంపకపోవడానికి కారణమేమిటి?" అంది.

"కొన్ని ప్రమాదకరమైన వస్తువులు దొరికినప్పుడు వాటి స్వంతదారుడెవరో తెలిసినా కూడా ప్రభుత్వం వారు తిరిగి ఇవ్వరు" అని ఊరుకున్నాను నేను.

ఏకళనుందో కానీ ఈ మాటకు మా ఆవిడ ఏమీ అనలేదు. కానీ "మీకేమీ ఫారిన్ ఛాన్సయినా రావడం లేదు. మనం ఫారిన్ వెడితే అమెరికాలో అనుభవాలనో, పారిస్‌లో నెలరోజులనో ఏదో రాద్దుము" అని బాధపడింది.

దీనికి నేను చెప్పవలసిందేమీ లేదు కాబట్టి ఊరుకున్నాను. తరువాత ఒక సలహా ఇచ్చాను. "పోనీ ఒక ఉత్తరం రాసిపారేయ్ మీ(మా) పత్రికలో ఫలానా కథ అద్భుతంగా ఉందనో, ఫలానా వ్యాసంలో ఇంత వరకూ చెప్పని విషయాలు చెప్పారనో ఏదో ఒకటి"

"ఇంత బ్రతుకూ బ్రతికి ఉత్తరం రాయనా" అంది శ్రీమతి. ఇంత బ్రతుకూ అన్న పదానికి నా కర్థం తెలియలేదు. బహుశా ఊహాలోకంలో తనో పెద్ద రచయిత్రిగాచలామణి అవుతోందేమో శ్రీమతి.

ఈ పరిస్థితుల్లో నాకో రోజున విరేచనాలు పట్టుకున్నాయి. నేను చదువుకున్నది సైన్సు సబ్జెక్టు అయినా మామూలు జబ్బులకు ఇంగ్లీషు మందులు వాడను. ఏ మందూ వాడకుండా తగ్గే అవకాశం ఉందేమో చూడడం మంచిదని నా అభిప్రాయం.

కానీ ఈసారి రెండ్రోజులయినా విరోచనాల ధాటీ తగ్గలేదు. నేను బాగా నీరసించిపోయాను.

ఆ రోజు శ్రీమతి గృహవైద్యం చేసింది. ఆమె జీలకర్రా, మిరియాలూ కలిపినూరి మూడు చెంచాల వేడి పాలలో ఆ చూర్ణాన్ని కలిపి ఇచ్చింది. అయినా తగ్గలేదు. ఆ మర్నాడుదయం డిస్పెన్సరీకి వెళ్ళాను. అక్కడ నాకు స్నేహితుడు భానోజీరావు తగిలాడు. ఆయనకీ విరేచనాలు.

నేను కొంచెం గర్వంగానే చెప్పాను. ముందు గృహవైద్యం ప్రయత్నించేకనే డిస్పెన్సరీకి వచ్చానని. నా గృహవైద్యమేమిటో తెలుసుకుని భానోజీరావు నవ్వడం ప్రారంభించేడు. ఏమని అడిగితే జవాబు చెప్పడానికతనికి వెంటనే సాధ్యపడలేదు. అతి కష్టం మీద నవ్వునాపుకుని "మీ ఆవిడ ఆ పత్రిక చదివి ఉంటారు. అందులో మా శ్రీమతి కొన్ని చిట్కాలు రాసింది. వాటిలో ఈ విరేచనాల మందు ఒకటి – అవి నమ్మేటంత తెలివి తక్కువ వాళ్ళుంటారని నేననుకోలేదు. కానీ మీరు సాక్షిలా ఎదురుగా నిలబడ్డారు అన్నాడు.

విరేచనాలకు గృహవైద్యం చిట్కారాసిన ఆమె భర్త భానోజీరావు – విరేచనాల

మందు కోసం డిస్పెన్సరీకి వచ్చాడు. అయితే ఆమె రాసిన చిట్కాలు ఎవరికోసం, ఎందుకోసం?

నా ప్రశ్నకు భానోజీరావు నవ్వి "ఏం చేస్తానండీ - రచయిత్రిని కావాలో అని నాభార్య నన్ను కాల్చేస్తోంది. కథలు రాయడం నా వల్ల కాదు. ఈ చిట్కాలు రాస్తే పత్రికల వాళ్ళు ఏ అభ్యంతరమూ లేకుండా ప్రచురిస్తున్నారు. మనకేంతోస్తే అది ఓ చిట్కా కింద రాసి పంపేయొచ్చు" అన్నాడు.

నాకు జ్ఞానోదయం అయింది. నేను భానోజీరావుకు కృతజ్ఞతలు చెప్పుకుని ఈ సలహా శ్రీమతికి చెప్పాను. ఆమె బాగా ఆలోచించి "అలా అయితే చిట్కాలేం కర్మ, కొత్త వంటలు కూడా రాయవచ్చు" అంది.

ఆ విధంగా శ్రీమతి రచయిత్రి అయేందుకు తరణోపాయం లభించింది. ప్రతీ వారం పత్రికల్లో ఆమె పేరు కనపడుతుంది. ఆమె రాసిన చిట్కాలను కొంతమంది అభినందిస్తూ ఉత్తరాలు కూడా రాశారు. (వాళ్ళు వాటిని ప్రయత్నించారని నేననుకోను. ఉత్తరాల శీర్షికలో పేరుకోసం అలా రాసి ఉంటారు).

మా ఆవిడ లేటెస్టుగా రాసిన చిట్కా - తల వెంట్రుకలు నెరియకుండా ఉండడానికి కరక్కాయ గంధం తీసి స్నానానికి అరగంట ముందు తలకు రాసుకోవాలి. ఆమె రాసిన లేటెస్టు వంట బీరకాయ పకోడీలు - బీరకాయలు చెక్కు తీసి ముక్కలు ముక్కలుగా తరిగి, తగినంత సెనగపిండి, ఉప్పు, పచ్చిమిర్చి అందులో వేసుకుని పకోడీలుగా వేసుకుంటే కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.

పాఠకులారా! వీటిని ప్రయత్నించి, మా శ్రీమతికి అభినందనలు తెలుపగలరు. అందుకు మీకు ఫలశృతి - ఉత్తరాల శీర్షికలో పేరు!

కథలు రాయలేని తరుణులకు - రచయిత్రులయే ఉపాయం చెప్పే ఉద్దేశ్యంతో ఈ కథ రాశానన్న విషయాన్ని పాఠకులు గుర్తిస్తారని ఆశిస్తాను.

✦ ✦ ✦